క్లుప్తంగా

నేడు భీమవరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: భీమవరం టుటౌన్‌లోని కొవ్వాడ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో నర్సింహాపురం ఇండస్ట్రియల్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 6 గంటల వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్ అహ్మద్‌ఖాన్ చెప్పారు. భీమవరం, ఉండి రోడ్డులోని వేంకటేశ్వరస్వామి గుడి ఏరియా, జడ్డు బ్రహ్మాజీ కల్యాణ మండపం ఏరియా, బైపాస్ రోడ్డు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని అహ్మద్‌ఖాన్ కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉండి: ఉండి, కోలమూరు 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లలో వార్షిక మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఫీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. సబ్‌స్టేషన్ల పరిధిలోని వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ



ఆకివీడు రైల్వే స్టేషన్‌లో ప్రచారం చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఆకివీడు: అప్రమత్తతోనే అగ్నిప్రమాదాల్ని నివారించాలని అగ్నిమాపక అధికారి వై.నాగేశ్వరరావు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా సోమవారం రెండవ రోజు స్థానిక అగ్నిమాపక కేంద్రం నుంచి వాహనంతో ప్రదర్శనగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. స్థానిక రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. సీహెచ్‌సీ వద్ద కాలనీలోని ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు.

విద్యార్థులకు పాదరక్షల పంపిణీ



విద్యార్థులకు పాదరక్షలు పంపిణీ చేస్తున్న మోటుపల్లి శ్రీనివాసరావు

ఆకివీడు: లయన్స్ ఆదర్శ క్లబ్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు మోటుపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పీఎల్ఎస్ జెడ్పీ పాఠశాల ఆవరణలోని ఎంపీపీ స్కూల్ విద్యార్థులు 100 మందికి పాదరక్షలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షరీఫ్, సభ్యులు సీతారామయ్య, శ్రీనివాసరాజు, అహ్మద్, మోరా జ్యోతిరెడ్డి, రాము, సాయి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ నాయకుల జీవితం స్ఫూర్తిదాయకం



వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ నాయకులకు నివాళులలర్పిస్తున్న అధ్యాపకులు

ఆకివీడు: జాతీయ నాయకుల జీవితం విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ టీ.ఓగేశ్వరరావు చెప్పారు. దుంపగడపలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో సోమవారం జాతీయ నాయకులు బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావ్‌పూలే జయంతిని కళాశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన, అట్టడుగు, వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు మహనీయులు కృషి చేశారని చెప్పారు. సంఘ సంస్కర్తలుగా, సమాజ శ్రేయస్సుకు వారు ఎన్నో త్యాగాలు చేశారన్నారు. వారి ఆశయాలను నెరవేర్చేందుకు విద్యార్థులు కృషి చేయాలన్నారు. సమావేశంలో రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు యు.శ్రీనివాసరావు, డాక్టర్ విజయ్ అనిల్ డాయ్, పీ.శ్రీనివాసరావు, ఎస్.జ్యోతి, ఏ.ఇందిర, పీ.సాయి సుప్రియ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా జగన్ వెంటే జనం





కాళ్ల మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న, వైఎస్సార్ సీపీ ఉండి ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహారాజు, నరసాపురం పార్లమెంట్ అభ్యర్థి గూడూరి ఉమాబాల

కాళ్ల: ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసిన ప్రజలంతా వైఎస్ జగన్ వెంటే ఉంటారని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహారాజు, నరసాపురం పార్లమెంట్ అభ్యర్థి గూడూరి ఉమాబాల తెలిపారు. ఉండి నియోజకవర్గం కాళ్ల మండలంలో క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, మాజీ టీటీడీ బోర్డు మెంబర్ గోకరాజు రామరాజు, పార్టీ సీనియర్ నాయకులు గాదిరాజు సుబ్బరాజుతో కలిపి ఎన్నికల ప్రచార ర్యాలీ సోమవారం పెద్ద ఎత్తున నిర్వహించారు. కాళ్ల మండలం పెద అమీరం పార్టీ క్యాంప్ కార్యాలయం నుంచి పెద అమీరం, వేంపాడు, కోపల్లె, బొండాడ, ఎల్.ఎస్.పురం, అనందపురం, మాలవానితిప్ప, కలవపూడి, మీదుగా ప్రాతళ్లమెరక, ఏలూరుపాడు, జువ్వలపాలెం, కాళ్లకూరు, దొడ్డనపూడి, కాళ్ల, సీసలి, జక్కరం గ్రామం వరకు సాగింది. నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్న ఈ ర్యాలీలో ప్రతి గ్రామంలోను పీవీఎల్ నరసింహారాజు, ఉమా బాలకు ప్రజలు అడుగడుగునా పూలమాలలు వేసి హారతులు పడుతూ ఘన స్వాగతం పలికారు. ఈ ర్యాలీలో ఆయా గ్రామాల్లో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రతిపక్షాలను ప్రజలు తరిమికొట్టడం ఖాయమని అన్నారు. పేదల పక్షాన పోరాడుతున్న జగన్‌మోహన్ రెడ్డికి అండగా నిలవాలని ప్రజలను కోరారు. సంక్షేమాభివృద్ధి పాలన కొనసాగేందుకు మళ్లీ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని ప్రజలను కోరారు. ఉండి నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గెలిపించాలని పీవీఎల్ కోరారు. నరసాపురం పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న విద్యావంతురాలు గూడూరి ఉమాబాలను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మంగళవారం మేము సిద్ధం కార్యక్రమానికి విచ్చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెనుమత్స విశ్వనాథరాజు, జడ్పీటిసి పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, కోపల్లె, కాళ్ల, కాళ్లకూరు, కలవపూడి సొసైటీల అధ్యక్షుడు వేగేశ్న జయ రామ కృష్ణంరాజు, సుంకర భోగేశ్వర రావు, బర్రె గంటయ్య, మధు సురేష్, జిల్లా ఆక్వా సలహా మండలి సభ్యులు పెనుమత్స దుర్గాప్రసాద్ రాజు, మండల కన్వీనర్ గణేశ్న రాంబాబు, రుద్రరాజు రామకృష్ణంరాజు, వీరమల్లు బోసు, మన్నే నాగరాజు, సాగిరాజు హరి వర్మ, దాట్ల శ్రీనివాస్ రాజు, పడమటి సుబ్బయ్య,వేగేశ్న రవిరాజు, కటారి లక్ష్మీపతి రాజు, డొక్కు సోమేశ్వరరావు, వేగేశ్న విజయరామ రాజు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువకులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ



ఆలయానికి భూమి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

వీరవాసరం: సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వామి వార్ల ఆలయ పునర్నిర్మాణ భూమి పూజ మహోత్సవం వీరవల్లివారిపాలెంలో సోమవారం నిర్వహించారు. బాలం సుధీర్ -మోహిని దంపతులు భూమి పూజ నిర్వహించారు. గ్రామంలో శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నరసాపురం పార్లమెంట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల దంపతులు, పాలకొల్లు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) దంపతులు, టీటీడీ పాలక మండలి సభ్యుడు మేక శేషుబాబు, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, మాజీ తణుకు మున్సిపల్ చైర్మన్ దొమ్మేటి సుధాకర్, సర్పంచ్ శిల బోయిన పద్మకుమారి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రవాహానికి టీడీపీ కూటమి గండి

ఆకివీడు: రాష్ట్రంలో సంక్షేమ ప్రవాహానికి గండి కొట్టే విధంగా వలంటీర్ వ్యవస్థపై టీడీపీ కూటమి కుట్ర పన్నిందని పలువురు వలంటీర్లు ఆరోపించారు. మండలంలోని సిద్ధాపురంలో 20 మంది, చెరుకుమిల్లిలో 16 మంది వలంటీర్లు సోమవారం తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ రామకృష్ణకు అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని పారదర్శకంగా అందజేస్తుంటే టీడీపీ కూటమి నాయకులు వలంటీర్లపై విమర్శలు చేయడం తగదన్నారు.

ఉండిలో 60 మంది వలంటీర్ల రాజీనామా

ఉండి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన గొప్ప అవకాశాన్ని వినియోగించుకుని ప్రజాసేవ చేస్తుంటే టీడీపీ, జనసేన నాయకులు వేస్తున్న నిందలు భరించలేకపోతున్నామంటూ ఉండి గ్రామానికి చెందిన వలంటీర్లు వాపోయారు. సోమవారం ఉండిలో నాలుగు సచివాలయాలకు చెందిన 60 మంది వలంటీర్లు రాజీనామా చేసారు. గ్రామ పంచాయతీ ఇన్‌ఛార్జ్ కార్యదర్శి కె. గోపాలకృష్ణకు తమ రాజీనామాలు సమర్పించారు. అనంతరం వలంటీర్లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం ఇవ్వడంతో ప్రజాసేవలో తరిస్తున్న మాపై టీడీపీ, జనసేన నాయకులు నిందలు వేయడం బాధ కలిగించిందన్నారు. దారుణంగా మాట్లాడి ఇప్పుడు అధికారంలోకి వస్తే రూ.10 వేలు జీతం ఇస్తానని చంద్రబాబు చెప్పడం ఆయన అధికార దాహానికి నిదర్శనమని అన్నారు.



రాజీనామా పత్రాలను ఎంపీడీఓకు అందజేస్తున్న చెరుకుమిల్లి వలంటీర్లు



సిద్ధాపురంలో రాజీనామా చేసిన 20 మంది వలంటీర్లు



ఉండి గ్రామ కార్యదర్శికి రాజీనామా పత్రాలు అందిస్తున్న వలంటీర్లు



స్వచ్ఛందంగా రాజీనామా చేసిన వలంటీర్లు

రాజీనామా అనంతరం మేమంతా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలుపునకు పూర్తిస్థాయి అండదండలు అందిస్తామని వారంతా అన్నారు.

వాలంటీర్లు స్వచ్ఛంద రాజీనామా

వీరవాసరం: మండల వ్యాప్తంగా పలు గ్రామాల నుంచి వలంటీర్లు సోమవారం స్వచ్ఛందంగా రాజీనామాలు సమర్పించారు. ఆయా గ్రామాల్లోని గ్రామ సచివాలయ కార్యదర్శులకు తమ రాజీనామా పత్రాలను అందజేశారు. స్వచ్ఛందంగా విధులు నిర్వహిస్తూ మంచి కార్యక్రమాలు చేస్తున్న గ్రామ వలంటీర్లపై టీడీపీ నాయకులు ఆరోపణలు చేస్తూ తన దుర్బుద్ధిని ప్రదర్శించారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరవాసరం మండల వ్యాప్తంగా 20 మంది వలంటీర్లు గ్రామ సచివాలయాల కార్యదర్శులకు రాజీనామా పత్రాలను అందజేశారు.

దొడ్డనపూడిలో వలంటీర్ల రాజీనామా



దొడ్డనపూడిలో మూకుమ్మడి రాజీనామాలు చేసిన వలంటీర్లు

కాళ్ల: కాళ్ల మండలం వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే మండలంలో పలువురు వలంటీర్లు రాజీనామాలు చేయగా సోమవారం దొడ్డనపూడి గ్రామ సచివాలయ పరిధిలో సేవలందిస్తున్న 30 మంది వలంటీర్లు ముకుమ్మడిగా రాజీనామాలు చేశారు. ఈ మేరకు తమ రాజీనామా పత్రాల్ని పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటరీ వ్యవస్థపై టీడీపీ వ్యవహరిస్తున్న తీరు చాలా బాధాకరమన్నారు. నిస్వార్థంగా సేవలందిస్తున్న తమను ప్రజలకు సేవలందించకుండా దూరం చేయడం సరికాదన్నారు. రాజీనామాలు చేసి నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న పీవీఎల్ నరసింహారాజు, ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమ బాల గెలుపునకు కృషి చేస్తామన్నారు.

గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యే గ్రంధి విశేష కృషి

భీమవరం అర్బన్: తీర ప్రాంత గ్రామాలు అభివృద్ధికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ విశేష కృషి చేశారని రాష్ట్ర ఔట్ సోర్సింగ్ డైరెక్టర్ కొప్పర్తి సత్యనారాయణ పేర్కొన్నారు. భీమవరం మండలంలోని గూట్లపాడులో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అంజిబాబు తీర ప్రాంత గ్రామాల అభివృద్ధి అంశంపై చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. తీర ప్రాంత గ్రామాలు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చొరవ తీసుకుని భీమవరం కేంద్రంగా దొంగపిండి, లోసరి వరకు సీసీ లైనింగ్ ఏర్పాటు చేయించారన్నారు. గూట్లపాడులో రక్షిత మంచినీటి చెరువు చుట్టూ రివిట్‌మెంట్ నిర్మించారని తెలిపారు. ఐదేళ్లుగా నెలకు రూ. 50 వేలు ఖర్చు చేస్తూ గ్రామాల్లోని ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చెలంకూరి సత్యనారాయణ మూర్తి, చెలంకూరి హనుమ ప్రసాద్ మినరల్ ప్లాంట్‌ను నడుపుతున్నారన్నారు. యనమదుర్రు డ్రెయిన్‌పై 4 వంతెనలు నిర్మించేందుకు గతంలోనే గ్రంధి శ్రీనివాస్ అనుమతులు తీసుకువచ్చారన్నారు. లోసరిలో ఉప్పుటేరుపై బ్రిడ్జి, నాగిడి పాలెంలో యనమదుర్రుపై బ్రిడ్జిలు నిర్మించేందుకు ఎమ్మెల్యే శ్రీనివాస్ ఎంతో కృషి చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) తీర ప్రాంత గ్రామాల అభివృద్ధిపై మాట్లాడటం హాస్యాస్పందంగా ఉందన్నారు. ఆయన శాసన సభ్యుడిగా చేసిన 10 ఏళ్ల నియోజకవర్గం అభివృద్ధిలో వెనకబడిందన్నారు. అనాకోడేరు, చినఅమిరం గ్రామాల సరిహద్దులో మంచినీటి ప్రాజెక్టు మంజూరవగా రైతుల వద్ద తక్కువ ధరకు భూములు కొనుగోలు చేసి తన పేరున రిజిస్ట్రేషన్ చేయించుకుని చేపలు, రొయ్యల చెరువులు తవ్వుకుని అంజిబాబు లబ్ధి పొందుతున్నాడని సత్యనారాయణ విమర్శించారు. 100 పడకల ఆస్పత్రి కోసం ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు చెందిన రూ.16 కోట్లు విలువ చేసే 4 ఎకరాల భూమిని స్వయంగా ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చారన్నారు. రెండు పర్యాయాలు శాసన సభ్యుడిగా పనిచేసిన అంజిబాబు హయాంలో చేసిన అభివృద్ధి, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ హయాంలో చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో సర్పంచ్ ఒడుగు ముత్యాలరావు, చెలంకూరి సత్యనారాయణ మూర్తి, చెలంకూరి శివ హనుమ ప్రసాద్, జవ్వాది గణేష్, చెలంకూరి శ్రీనివాసరావు, రేవు నరసింహస్వామి, సంధి డేనియేలు, కాగిత సురేష్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కేఆర్ కళాశాలకు అవార్డులు



అవార్డు సాధించిన సందర్భంగా శివకిషన్‌ను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఏసీఐసీ సెంటర్‌కు శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ ఇంక్యుబేషన్ సెంటర్ నుంచి రెండు అవార్డులు లభించాయని కళాశాల డైరెక్టర్ ఎం. జగపతి రాజు, ప్రిన్సిపల్ కేవీ మురళీకృష్ణంరాజు సోమవారం చెప్పారు. కళాశాలలో అటల్ కమ్యూనిటీ ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేసినందుకు కళాశాలకు బెస్ట్ స్టార్టప్ ఏకో సిస్టం ఎనేబులర్ అవార్డుతోపాటు సివిల్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సంద్యాల శివకిషన్‌కు వ్యక్తిగత విభాగంలో బెస్ట్ స్టార్టప్ ఏకో సిస్టం ఎనాబులర్ అవార్డు లభించిందన్నారు. అనంతరం శివకిషన్‌ను జగపతి రాజు, మురళీకృష్ణంరాజు అభినందించారు.

ఇంటర్‌లో బ్రౌనింగ్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

భీమవరం: ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో భీమవరం బ్రౌనింగ్ జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబర్చారని ప్రిన్సిపల్ రంప ఎలీషా చెప్పారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీలో మేరి జాష్విన్ 928 మార్కులు, డి జ్యోతి 918, షారోన్‌లిల్లీ 917, ఎంపీసీలో మిరియం 915, సీహెచ్ ప్రతిమ 908, త్రివేణి 922 మార్కులు సాధించారని చెప్పారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ప్రెసిడెంట్ మేడిద జాన్సన్, సెక్రటరీ ఎస్తేరు ప్రియాంక, డి అబ్రహం, ఏలీషా అభినందించారు.

విష్ణు ఫార్మసీ విద్యార్థుల ప్రతిభ

భీమవరం: విజయవాడ సిద్దార్థ కాలేజీ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో ఈనెల 12, 13 తేదీల్లో నిర్వహించిన నేషనల్ స్పోర్ట్స్ ఈవెంట్‌లోని వివిధ విభాగాల్లో భీమవరం శ్రీవిష్ణు ఫార్మసీ కళాశాల విద్యార్థులు బహుమతులు సాధించారని ప్రిన్సిపాల్ కేవీఎస్ నాటరాజ్ సోమవారం చెప్పారు. బ్యాడ్మింటన్ డబుల్స్‌లో కేఎస్ శృతి, బి.మహాలక్ష్మి విజేతలుగా నిలవగా, త్రో బాల్‌లో లావణ్య, అంజనీరెడ్డి బృందం ద్వితీయస్థానంలో నిలిచిందన్నారు. విజేతలను ప్రిన్సిపల్ నటరాజ్, అడ్మిన్ డైరెక్టర్ ప్రసాద్‌రాజు అభినందించారు.